# ఇన్లాండ్ లెటర్ కథలు

## పెళ్లిచూపులు

ముకుందం చేరేటప్పటికి బస్ స్టాప్ అంతా ప్రయాణీకులతో కోలాహలంగా ఉంది. దూరంగా ఒక అందమైన అమ్మాయి కుందవ శిల్పంలా కనిపించింది. దగ్గరగా వెళ్లి ఎక్స్‌క్యూజ్‌మీ! అన్నాడు ముకుందం. ఎందుకన్నట్టుగా అసహనంగా చూసిందామె అతనివైపు. రాఘవాపురం వెళ్లే బస్సు ఇక్కడికే కదా వస్తుంది! అని అడిగాడు ముకుందం. విశాలనేత్రాలతో అవునని తలూపింది. మీరెక్కడికి వెళ్తున్నారని మళ్లీ ప్రశ్నించాడు...ఎక్కడికెళ్లితే మీకెందుకని ఆమె ఎదురు ప్రశ్న వేసేటప్పటికి దిమ్మ తిరిగివ ముకుందం ఆమెను మాట్లాడించే ప్రయత్నానికి అడ్డుకట్టవేశాడు.

పెళ్లి చూపుల కోసం మేనమామ కూతురు విశాలాక్షిని చూడ్డానికి ముకుందం ఆ ఊరు వెళ్లవలసి వచ్చింది. వయసు మూడు పదులు దాటుచున్నా ఇంతవరకూ ఆడగాలి ఏ మాత్రం సోకని నిష్కల్మష బ్రహ్మచారి ముకుందం. రమారమి ఇరవై సంవత్సరాల క్రితం తండ్రి అకస్మాత్తుగా చనిపోతే, తన చదువు నిమిత్తంగా ఆస్తంతా అమ్మి అమ్మ పట్నం వచ్చేసింది. మొత్తానికి చదువులో పురోగమించటం ఎల్.ఐ.సి.లో ఉద్యోగం సంపాదించటంతో అతని జీవితం సెటిలయ్యింది. మేనమామ దశరథ రామయ్య కూతురును ఏమైనా సరే పెళ్లి చేసుకోవాలని తల్లి పట్టు బట్టిన కారణంగా ముకుందం రాజీకి రాకతప్పలేదు. పైగా మేనమామ ఆపత్సమయంలో తన కుటుంబాన్ని ఆదుకొన్న దృష్ట్యా మావవత్వంతో ముకుందం ఈ పెళ్లికి ఒప్పుకుని పెళ్లిచూపులకు వస్తున్నట్టుగా దశరథరామయ్యకు ఉత్తరం రాశాడు. పట్నం వచ్చిన తర్వాత ముకుందం ఇంత వరకూ రాఘవాపురం వెళ్లలేదు. ఇదే వెళ్లటం కాబట్టి అతని జీవితంలో పెళ్లి చూపులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఇంతలో తన ఊహలను చెల్లా చెదురు చేస్తూ బస్సు వచ్చేసింది. ప్రయాణీకులతో యుద్ధం చేసి వీరసైనికుడిలా బస్సెక్కాడు. మరీ విచిత్రం ఏమిటంటే..విశాలనేత్రాల అమ్మాయి కూడా ఆ బస్సెక్కింది. బస్సు కదులుతున్నంత సేపూ తదేకంగా పారవశ్యంగా ఆమెను చూస్తూండిపోయాడు ముకుందం. ఆమె ముకుందం వాలకం గమనించినప్పటికీ గమనించనట్టుగా ఉండిపోయింది. ఒకదశలో ఈ పెళ్లిచూపుల తతంగం లేకపోతే ఈ అమ్మాయినే పెళ్లి చేసుకునే వాడిననుకొన్నాడు స్వగతంగా ముకుందం.

ప్రేయసీ వీక్షణంలో యుగాలు నిమిషాలైనట్టుగా రాఘవాపురం వచ్చేసింది. నీరసంగా బస్సు దిగాడు ముకుందం. ఆ వెనుకే ఆమె కూడా దిగింది. ఆమెను సంభ్రమంతో చూస్తూ ఏమండీ అంటూ వేగంగా వెళ్లబోతున్న ఆమెను పిలిచాడు. ఈసారి ఆమె అతని వంక పార్ద్రంగా చూసింది. దశరథ రామయ్య గారిల్లు మీకు తెలుసా అన్నాడు తెలుసండి. నాకు వాళ్ల ఇల్లు చూపిస్తారా! అని అడిగాడు...ఆయన మీకేమవుతారు అందామె..మామయ్యండీ. .అన్నాడు ముకుందం.

ఆనందంగా అంతకుముందే ఉత్తరం సంగతి తెల్సిన ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబారింది. ఆ క్షణం ఆమె మనస్సు దూది పింజంలా గాల్లో ఎగిరిపోయింది. నేనెవర్నో మీకు తెలుసా అని సిగ్గును అభినయిస్తూ అడిగిందామె. ఎవరు మీరని ఆశ్చర్యంతో అడిగాడతను. నేనే విశాలాక్షిని. అని చెప్పగానే ముకుందానికి మూర్ఛ వచ్చినంతపనైంది. అనుకున్నంతలోనే ఇల్లు దగ్గరపడింది. పరకాంతల వంక అలా చూడవచ్చాని చివర్లో ఆమె అతనికి చురక వేసింది. దుష్యంతుడు శకుంతలను వలచినట్టుగానే నేను నిన్ను వరించాను. శంకాపీడితుడైన దుష్యంతునికి శకుంతల క్షత్రియ కన్య అయినట్లుగా నువ్వు నా మేనమామ కూతురివి అయ్యావంతే! అన్నాడు ముకుందం నవ్వుతూ.

మంకు శ్రీను.

## కేటు–డూపికేటు



ఇతనే ప్రఖ్యాత రచయిత వామనమూర్తి అంటూ పరిచయం చేసాడు గుర్నాథం మిత్రుడు రామమూర్తికి. రామమూర్తి వామనమూర్తితో కరచాలనం చేశాడు. అతని ఆనందానికి కారణం ఉంది. ఇటీవలే రచనలు చేయనారంభించిన రామమూర్తికి ఎవరైనా ఎస్టాబ్లిష్డ్ రైటర్ సహకారం కోసం చూస్తున్నాడు. వామనమూర్తి గారికి కావలసిన వివరాలు అందజేశాడు. తమ ఇంటికి రచనలు తీసుకుని అప్పుడప్పుడు వస్తూ వుండమని చెప్పి వెళ్లిపోయాడు వామనమూర్తి.

వారం తరువాత రామమూర్తి రాసిన 'ముసురు' అన్న కథను తీసుకుని వామనమూర్తి దగ్గరకెళ్లాడు. కథను చదివి వామనమూర్తి పెదవి విరిచాడు. "కథ ఎలా రాయాలో మీకు తెలియడం లేదు. ముగింపులో కొనమెరుపు కనబడాలి. శైలికి ఇంకా మెరుగులు దిద్దాలి." అంటూ కథను తిరిగి ఇచ్చేశాడు వామనమూర్తి. రామమూర్తి నిరాశతో ఇంటిదారి పట్టాడు.

మరో పదిరోజులకు తను రాసిన ఇంకో కథను వామనమూర్తి దగ్గరకు తీసుకువెళ్లాడు. ఆ కథకూడ ప్రచురణకు పనికిరాదని తిరిగి ఇచ్చేశాడు వామనుడు.

రెండు నెలల తర్వాత 'ఆంధ్రవాణి' పత్రిక తిరిగేస్తూ రామమూర్తి వులిక్కిపడ్డాడు. 'తుఫాను' అన్న పేరుతో తన కథను యథాతథంగా రాశారు. మరో సంచికలో రామమూర్తి రాసిన మరోకథ కూడ పేరుమార్చి ప్రచురింపబడింది. రెండింటి రచయితా వామనమూర్తే!

మరో నెల తరువాత కథ తీసుకుని వామనమూర్తి దగ్గరకెళ్లాడు రామమూర్తి. కాసేపు ఆ మాట ఈ మాట మాట్లాడి వామనమూర్తి కథ చదివి కొంతవరకు శైలి మెరుగుపడ్డా ఇంకా ప్రచురణస్థాయికి రాలేదన్నాడు.

నెలరోజుల తరువాత రామమూర్తి అనుకున్నట్లు గానే 'ఉగాది కథల పోటీ'లో తను రాసిన కథనే వామనమూర్తి తిరగరాసి మూడవబహుమతి సంపాదించాడు. తరువాత సంచికలో మంచి కాపీకథ రాసినందుకు పాఠకులు వామనమూర్తిని దుమ్మెత్తిపోయసాగారు. నాలుగేళ్లక్రితం ఒకపోటీలో బహుమతి పొందిన కథనే రామమూర్తి వామనమూర్తికి చూపించినది. ఆ పత్రిక యాజమాన్యం వామనమూర్తి రచనలను ఇక ప్రచురించమని ప్రకటించింది.

మరునాడు బజారులో రామమూర్తికి వామనమూర్తి కెదురుపడగా, పలకరింపులోనే ఎవరో తరుముతున్నట్టు పక్క సందులోంచి దూరిపోయాడు వామనమూర్తి. రామమూర్తి ముసిముసిగా నవ్వుకున్నాడు.

రమేష్